

వీణవంక: బేతిగల్ లో సంబురాల్లో నాయకులు, కార్యకర్తలు



ఇల్లందకుంట: పటాకులు కాల్చుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

# బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

- ఎమ్మెల్యేగా కౌశిక్ రెడ్డి గెలుపుపై హర్షాతిరేకాలు
- పటాకులు కాల్చి, స్వీట్లు పంచిన గులాబీ పార్టీ శ్రేణులు
- జమ్మికుంటలో గాంధీ, అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



హుజూరాబాద్‌టౌన్: అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చుతున్న నాయకులు, కార్యకర్తలు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 3: హుజూరాబాద్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి 17 వేల మెజార్టీతో గెలుపొందడంపై హుజూరాబాద్ పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సంబురాలు అంబరాన్నంటాయి. 'జై కౌశిక్ అన్న', 'బీఆర్ఎస్ జిందాబాద్' అన్న నినాదాలు మార్మోగాయి. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, రావుల రాజలింగారెడ్డి, కిషన్‌రెడ్డి, రామారావు, శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌కే రమేశ్, శంతన్ రెడ్డి, యాదగిరినాయక్, గఫార్, అమ్జద్, అర్షద్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

***ఇప్పల్‌నర్సింగాపూర్‌లో..***

హుజూరాబాద్, డిసెంబర్ 3: పాడి కౌశిక్‌రెడ్డి గెలుపుపై పట్టణ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్‌లో గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టి, పటాకులు కాల్చారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు గోవిందుల భాస్కర్, కల్లెపు అఖిల్, యాళ్ల రాజిరెడ్డి, సామల శ్రీనివాస్‌రెడ్డి, పుట్టపాక రమేశ్ తదితరులు ఉన్నారు.

***గాంధీ, అంబేద్కర్‌లకు 'పాడి' నివాళి***

జమ్మికుంట, డిసెంబర్ 3: జమ్మికుంట పట్టణంలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం పట్టణానికి వచ్చిన ఆయనకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

***ఇల్లందకుంటలో..***

ఇల్లందకుంట, డిసెంబర్ 3: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై నాయకులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కౌశిక్‌రెడ్డికి ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సంబురాల్లో సర్పంచులు రాజిరెడ్డి, దిలీప్‌రెడ్డి, రాజు, అరుణాసదానందం, మానసామహేందర్, వనమాలావాసు, రజితావాసుదేవరెడ్డి, మొగిలి, సరోజన, తిరుపతి రెడ్డి, రఫీఖాన్, వెంకటస్వామి, ఎంపీపీ పావనీవెంకటేశ్, మాజీ ఎంపీపీ చుక్క రంజిత్, పీఏసీఎస్ చైర్మన్ ఉప్పుల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్లు కందాల కొమురెల్లి, ఉడుత వీరస్వామి, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, చిన్నరాయుడు, ఓదెలు, విజయకుమార్, మాజీ ఎంపీటీసీ రాంస్వరణ్‌రెడ్డి, మాజీ సర్పంచులు బుర్ర రమేశ్, కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, రవీందర్, దేవేందర్, రాజిరెడ్డి, వేణు, కుమార్, అభిలాష్‌రెడ్డి, రత్నాకర్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

***వీణవంకలో..***

వీణవంక, డిసెంబర్ 3: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలుపొందడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకొన్నారు. ఆదివారం ప్రకటించిన 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సొంత మండలం అండగా నిలిచి బ్రహ్మరథం పట్టి గెలుపులో భాగస్వాములయ్యారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు రంగులు పూసుకొని సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలకు ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, వైస్‌ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హుజూరాబాద్: ఇప్పల్‌నర్సింగాపూర్‌లో గులాబీ శ్రేణులు సంబురాలు

# ఫలించిన శాలినీరెడ్డి కృషి

- మహిళల్లో పెరిగిన సానుభూతి

హుజూరాబాద్/టౌన్, డిసెంబర్ 3: శాసన సభ ఎన్నికల్లో తన భర్త పాడి కౌశిక్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలిచిన శాలినీరెడ్డి కృషి ఫలించింది. ఆది నుంచి ఎన్నికల ప్రచారంలో కౌశిక్‌రెడ్డితో కలిసి ఆమె పాలు పంచుకున్నారు. ప్రతి సమావేశంలో పాల్గొని ఓటర్లను ఆకుట్టుకునేలా ప్రసంగించారు. 15 సంవత్సరాల నుంచి తన భర్త ప్రజాసేవలో పాలు పంచుకుంటున్నారని, ఒక్క అవకాశం ఇవ్వాలని కొంగుచాచి అభ్యర్థించారు. నియోజకవర్గ అభివృద్ధిలో తన భర్త కౌశిక్‌రెడ్డి వెంట నిలిచి పనులు చేయిస్తానని చెప్పడం... ఉప ఎన్నికల్లో గెలిపించిన ఈటల రాజేందర్ ఒక్కసారి కూడా నియోజకవర్గ ప్రజలకు ముఖం చూపించకపోగా అభివృద్ధి కూడా చేయలేదని ఆమె చెప్పిన మాటలను ప్రజలు విశ్వసించారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరుగుతూ కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని వేడుకున్న తీరు మహిళల్లో సానుభూతిని తీసుకువచ్చాయి.



హుజూరాబాద్‌టౌన్: ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న శాలినీరెడ్డి

## నెరవేరిన శ్రీనిక కోరిక..

'ప్లీజ్ మా డాడీకి ఒక్క అవకాశం ఇవ్వండి'.. అంటూ కౌశిక్‌రెడ్డి కూతురు శ్రీనికారెడ్డి ఓటర్లను వేడుకున్న తీరు ప్రజలను ఆలోచింప జేసింది. ఎట్టకేలకు కౌశిక్‌రెడ్డి గెలుపుతో శ్రీనికారెడ్డి కోరిక నెరవేరింది.

# ఎన్నికల ఫలితాలపై ఓటర్ల ఆసక్తి



కంప్యూటర్‌లో టీ న్యూస్ పెట్టుకొని ఎన్నికల ఫలితాలు ఆసక్తిగా చూస్తున్న పట్టణ ప్రజలు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 3: హుజూరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై రౌండ్ రౌండ్‌కు ఉత్కంఠ నెలకొనడంతో ఏ రౌండ్‌లో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందోననే ఆత్రుతతో పట్టణంలో చాలా చోట్లా ప్రజలు ఆదివారం టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోయారు. ఫలితాలను ఎంతో ఆసక్తిగా చూస్తూ చర్చల్లో మునిగిపోయారు. మొత్తం మీద హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి 17వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలవడంపై హుజూరాబాద్ ప్రజలు పట్టలేనంత ఆనందం వ్యక్తం చేశారు.

# ఈటలకు కమలాపూర్ మొండిచెయ్యి

- ప్రతి రౌండ్‌లో కౌశిక్‌రెడ్డికే ఆధిక్యం

హుజూరాబాద్/టౌన్, డిసెంబర్ 3: ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున బరిలో నిలచిన ఈటల రాజేందర్‌కు సొంత మండల ప్రజలే మొండి చెయ్యి చూపారు. అక్కడ ఆరు రౌండ్లు ఉండగా చివరి మూడు రౌండ్లలోనే స్వల్ప ఆధిక్యతను ప్రజలు కట్టబెట్టారు. ఎన్నికల సరళిని పరిశీలిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి వైపే కమలాపూర్ ప్రజలు మొగ్గు చూపారు. మొత్తంగా చూసుకుంటే 22 రౌండులలో 19 రౌండ్లు కౌశిక్‌రెడ్డి ఆధిక్యత చూపారు. కౌశిక్‌రెడ్డికి 80,333 ఓట్లు రాగా, ఈటల రాజేందర్‌కు 63,460 ఓట్లు రావడంతో ద్వితీయ స్థానానికి పరిమితమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌కు 53,164 ఓట్లు వచ్చాయి. మొదటి రౌండు నుంచి ఆధిక్యత కనబర్చిన పాడి కౌశిక్‌రెడ్డి 19వ రౌండ్ వరకు 17,937 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే చివరి రౌండ్లలో ఈటలకు స్వల్ప ఆధిక్యత రాగా, ఆఖరు లెక్కింపులో 16,873 ఓట్లతో పాడి కౌశిక్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ప్రతి మండలంలో కౌశిక్‌రెడ్డికి మెజార్టీ ఓట్లు రావడం విశేషం. ఎక్కడ కూడా కౌశిక్‌రెడ్డికి ప్రత్యర్థులు సరైన పోటీని ఇవ్వలేకపోయారు.

# పటాకులు కాల్చి.. స్వీట్లు పంచి



చిగురుమామిడి: బొమ్మనపల్లిలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న పార్టీ శ్రేణులు

సైదాపూర్, డిసెంబర్ 3: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గెలుపొందడంపై మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆపార్టీ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా పటాకులు కాల్చి , స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, డిసెంబర్ 3: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గెలుపుపై మండల కేంద్రంలో జడ్పీటీసీ గీకురు రవీందర్ ఆధ్వర్యంలో, రేకొండలో సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన ఓటర్ల చైతన్యం

- గత ఉప ఎన్నికలతో పోల్చుకుంటే అత్యల్పంగా నోటాకు ఓట్లు
- కేవలం పోస్టల్ ఓట్లలోనే కాంగ్రెస్ ఆధిపత్యం

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 3: హుజూరాబాద్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఓటర్లలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం వెల్లివిరిసింది. గత ఉప ఎన్నికలప్పుడు సుమారు 1600 వరకు నోటాకు ఓట్లు పోలవగా, ఈ ఎన్నికల్లో కేవలం మూడే ఓట్లు పడడం ఓటర్ల స్పష్టమైన తీర్పుకు ప్రతీకగా నిలిచింది. అలాగే 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో సుమారు 2300కు పైగా చెల్లని ఓట్లు పోలవగా ఈసారి ఈ ఎన్నికల్లో కేవలం 325 ఓట్లు మాత్రమే రిజెక్ట్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఏదేమైనా గత ఉప ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్లు తమ ఓటు హక్కును వృథా చేయకుండా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించారు. సరైన అభ్యర్థిని ఎంచుకొని తమ ఓటు వేసి స్పష్టమైన తీర్పు ఇచ్చారు. పోస్టల్ ఓట్లలో కూడా గత ఉప ఎన్నికలప్పుడు రెండు వేలకు పైగా ఓట్లు వేసిన ఉద్యోగులు, ఈసారి కొంత తగ్గినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌కు 703 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 615, విజేత అయిన బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి 330 పోస్టల్ ఓట్లు పోల్ అయ్యాయి. అలాగే బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి పల్లె ప్రశాంత్‌గౌడ్‌కు 27, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థికి ఆరు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థికి ఒకటి, న్యూ ఇండియా పార్టీ అభ్యర్థికి రెండు, ఇండిపెండెంట్లు ఇమ్మడి సతీశ్‌కు ఒకటి, బరిగే గట్టయ్య యాదవ్‌కు ఒకటి చొప్పున పోస్టల్ ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ ఓట్లలో మాత్రమే ప్రభావం చూపిన కాంగ్రెస్ అభ్యర్థి ఏ ఒక్క రౌండులో అధిపత్యం చూపకపోగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కేవలం రెండే రెండు రౌడ్లలో మాత్రమే స్వల్ప మెజార్టీ కనబరిచారు. దీంతో నియోజకవర్గ ఓటర్లు అత్యధికంగా అధికార పార్టీ అభ్యర్థి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చి పార్టీపై తమకు నమ్మకాన్ని ఓటు రూపంలో ప్రదర్శించారు.